క్లుప్తంగా

పీహెచ్‌సీలో మూడు సాధారణ ప్రసవాలు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో శనివారం ఒక్కరోజే మూడు సాధారణ ప్రసవాలు జరిగాయి. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి ముగ్గురు గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేయించారు. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. శిశువులకు పుట్టిన వెంటనే టీకాలు వేశామని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, అందరు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

టీఏ, డీఏలు చెల్లించాలి

మణుగూరురూరల్: ఎన్నికల విధులు నిర్వహించిన బీఎల్‌ఓలకు తక్షణమే టీఏ, డీఏలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సమస్యలపై సీఐటియు ఆధ్వర్యంలో మణుగూరు తహసీల్దార్ రాఘవ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించిన బీఎల్‌ఓలకు నెలలు గడుస్తున్నా టీఏ, డీఏలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రతీ పనిలో భాగస్వాములు అవుతున్న బీఎల్‌ఓలకు సమగ్ర కుటుంబ సర్వేలో ప్రాధాన్యత కల్పించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో శ్యామల, హేమలత, సుశీల, రమణ, యశోద, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

అశ్వారావుపేటరూరల్: సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎన్యూమరేటర్లుగా ఎంపికైన ఉపాధ్యాయులకు శనివారం స్థానిక తహసీల్‌లో విధులు కేటాయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే చేయాలని తెలిపారు. స్థానిక రైతువేదికలో రేపు (సోమవారం) ఎన్యుమరేటర్లకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లుగా నియమితులైన 116 మంది ఎస్జీటీ టీచర్లు 6వ తేదీ నుంచి అన్ని జీపీల్లో సర్వే ప్రారంభిస్తామన్నారు. గిర్దావార్‌లు కృష్ణ, సత్యావతి పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు సాధించాలి

ములకలపల్లి: అమర వీరుల ఆశయ సాధనకు శక్తివంచనలేకుండా కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ పిలుపునిచ్చారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన గుట్టగూడెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అమరులు కణితి నాగేశ్వరరావు, తుర్సం కృష్ణ స్మారకస్థూపాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, కణితి వెంకటేశ్వర్లు, తుర్సం భవాని. పైదా కోటేశ్, కాకా బాబూరావు, సున్నం రాజులు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా వృద్ధాశ్రమం నిర్వహిస్తూ వృద్ధులకు సేవ చేస్తున్న షహనాజ్ బేగం, మెహరాజ్ దంపతుల సేవలు అభినందనీయమని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి సింగరేణి ఉద్యోగి క్వింటా బియ్యం, నిత్యావసర వస్తువులను శనివారం రాధాకృష్ణ చేతుల మీదుగా వృద్ధాశ్రమానికి అందజేశారు. వృద్ధులకు పాలు పండ్లు అందజేశారు. షహనాజ్, మెహరాజ్ దంపతులను సన్మానించారు. వృద్ధాశ్రమాన్ని సందర్శించిన రాధాకృష్ణను, మణుగూరు బాలవెలుగు పాఠశాల నిర్వాహకులు జగన్‌మోహన్‌రెడ్డిని షహనాజ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యుడు నాజర్‌పాషా, జగన్మోహన్‌రెడ్డి, ఆంగోత్ మంగీలాల్, హుమాయన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు వహించండి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై హాస్టల్ సిబ్బంది దృష్టి పెట్టాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం పేరెంట్స్ కమిటీ సభ్యులు ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పిల్లలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా.. వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందజేయాలని, నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కారం గోపాల్, కార్యదర్శి అపకా నాగయ్య, సభ్యులు సొందె మల్లూరు, తెల్లం భీమరాజు, పొడియం మురళి తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభలు

చండ్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. గుర్రాయిగూడెం, బెండాలపాడు, ఎర్రబోడు, కరిశెలబోడుతండా, వంకనెంబర్, పులిగుండం గ్రామాల్లో సభలు సాగాయి. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుల ఎస్‌కె.ఉమర్, వరికూటి వెంకట్రావ్, సత్యనారాయణ, డి.బాలు, ధన్యనాయక్, రాంబాబు, రవ్వ రమేష్, లక్ష్మక్క తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్.. పనితీరు అదిరెన్!

- పలువురికి ఉపాధినిస్తున్న రెక్కల రోబో
- ఫొటోగ్రఫీలో పెరుగుతున్న డ్రోన్ వినియోగం
- నిఘా వ్యవస్థ, మందుల పిచికారీలో తనదైన ముద్ర

సండే స్పెషల్



భద్రాచలం వద్ద వరదల సమయాన డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో



ఓ కార్యక్రమంలో డ్రోన్ వినియోగిస్తున్న ఆపరేటర్

భద్రాచలంఅర్బన్: ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యతనిస్తూ శుభకార్యాలు మర్చిపోలేని జ్ఞాపకంగా పదిల పరుచుకోవాలని ఎన్నో నూతన ఉపకరణాలను ఫొటోగ్రాఫర్లు వినియోగిస్తున్నారు. సృజనాత్మక పద్ధతులను వినియోగిస్తూ మరింత ఆకర్షణీయంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారికి సరికొత్త టెక్నాలజీలు తోడ్పాటుగా నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో డ్రోన్ (అన్ మ్యాన్‌డ్ ఏరియల్ వెహికిల్) ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వినియోగం ఎంతగానో పెరిగింది. కష్టమర్లకు సినిమాటిక్ అనుభూతిని అందిస్తూ, వారి శుభకార్యాల్లో డ్రోన్ సందడి చేస్తోంది. నిఘా వ్యవస్థలోనూ, రాజకీయ నాయకుల సమావేశాల్లో వీటి వినియోగం పెరిగింది. కాగా మొదట్లో ఇలాంటి డ్రోన్ల వినియోగం పెద్ద పెద్ద నగరాల్లో ఉండేవి, ప్రస్తుతం వీటి వినియోగం ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ వీటి వినియోగం ఈ మధ్య కాలంలో భాగానే పెరిగిపోయింది.

నయా ట్రెండ్..

తమ మధుర క్షణాలను కెమెరాల్లో బంధించుకుని, ఫొటోలు, వీడియోల రూపంలో చూసుకొని సంబరపడిపోతారు. దీంతో ఫొటోగ్రఫీలో వినూత్నమైన ఆలోచనలతో ఫొటోగ్రాఫర్లు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగానే డ్రోన్ ఫొటోగ్రఫీ ఎంతో పాపులర్ అయింది. పెళ్లి వేడుకల్లో ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్లలో డ్రోను వినియోగిస్తున్నారు. అద్దెకు అందుబాటు ధరల్లోనే డ్రోన్ షాట్స్ కోసం అద్దెకు ఇస్తుంటారు. అదేవిధంగా డ్రోన్ ఉన్నవారు స్వయంగా వారి విజువల్స్ తీస్తూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఒక్కరోజుకూ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు అద్దెకు ఇస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ప్రారంభంలో వీటిని కొందరు ఫొటోగ్రాఫర్లు మాత్రమే వినియోగించగా.. డ్రోన్ ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం పెరగడంతో ప్రస్తుతం అందరూ డ్రోన్లను విరివిగా ఉపయోగిస్తున్నారు.

పటిష్ట బందోబస్తుకు..

రాజకీయ ర్యాలీలు, సమావేశాల్లో, సభల్లో వీటి వినియోగం పెరిగింది. అదే విధంగా పలు సందర్భాల్లో పోలీస్ యంత్రాంగం సైతం నిఘా వ్యవస్థ పటిష్టానికి, బందోబస్తు కోసం ఈ రెక్కల రోబోను వినియోగిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల పర్యవేక్షణకు, వ్యవసాయ క్షేత్రాల్లో మందుల పిచికారీ, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధి తులకు సాయం చేసేందుకు తోడ్పాటు అందిస్తున్నాయి. ప్రధానంగా భద్రాచలంలో ప్రతి ఏడాది వచ్చే వరద ఉధృతిని డ్రోన్ సహాయంతో చిత్రికరిస్తున్నారు.

ప్రాధాన్యత పెరిగింది



ప్రారంభంలో డ్రోన్ ఫొటోగ్రఫీకి సంబంధించి అవగాహన తక్కువగా ఉండేది. కొందరు మాత్రమే వీటిని ఆపరేట్ చేయడంతో పాటు కొన్ని ఈవెంట్లో మాత్రమే వినియోగించేవారు. అయితే ప్రస్తుతం వీటికి ఆదరణ రోజురోజుకూ పెరుగుతూ వస్తుంది. ప్రతిఒక్కరూ వీటిని సులభంగా వినియోగించే సౌలభ్యంతో డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడున్న ట్రెండ్ ప్రకారం ప్రతీ కార్యక్రమానికి డ్రోన్‌ను వినియోగిస్తున్నారు.

– గంజి ఎడ్వర్డ్ రాజు, డ్రోన్ ఆపరేటర్, భద్రాచలం

రైతులను చైతన్యవంతం చేయాలి



వ్యవసాయ సంబంధిత స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: భూసారానికి తగిన పంటలను నూతన పద్ధతులు, సేంద్రీయ విధానం ద్వారా సాగు చేసేలా రైతులను చైతన్యవంతం చేయాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. శనివారం మండలంలోని మల్లారం రైతు వేదికలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరపు విద్యార్థులచే నిర్వహించనున్న జాతీయ సేవా పథకం శిబిరాన్ని ఎమ్మెల్యే జారే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లారం గ్రామంలో కలియతిరిగి, ప్రధాన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పరిశుభ్రత, పచ్చదనం ప్రాముఖ్యతను గ్రామస్తులకు తెలియజేసి, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేసి, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయ సంబంధిత స్టాళ్లను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.

ఆయిల్ ఫెడ్ సిబ్బందికి అభినందనలు..

ఫ్యాక్టరీల్లో ఈ సంవత్సరం 19.40 శాతం ఓఈఆర్ (ఆయిల్ రికవరీ శాతం) వచ్చేలా కృషిచేసిన పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లను, స్థానిక ఎమ్మెల్యే అభినందించారు. శనివారం మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. పామాయిల్ ధర టన్నుకు రూ.19.144లు వచ్చేలా తీవ్రమైన కృషిచేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయిల్ రికవరీ శాతం పెరుగుదలకు కృషిచేసిన అధికారులు, సహకరించిన రైతులను అభినందించారు. ఆయిల్ ఫెడ్ మేనేజర్లు బాలకృష్ణ, కళ్యాణ్, నాగబాబులను ఎమ్మెల్యే, రైతులు శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబరు అలపాటి రామచంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మండల కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవాదళ్ కార్యవర్గానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వాలని సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కోరారు. శనివారం మండల కేంద్రం, దమ్మపేటలో కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి దయాకర్, స్థానిక ఎమ్మెల్యే జారే హాజరయ్యారు. సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నులా నిలిచారని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు వీరికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. సేవాదళ్ సభ్యులకు తగిన ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, నియోజకవర్గ బూత్ స్థాయి ఇంచార్జ్ కక్కిరాల రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి దయాకర్

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు టీచర్లు విధిగా కృషి చేయాలని ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. శనివారం ఆయన అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. సీఆర్పీ ప్రభాకరాచార్యులు ఉన్నారు.

కళా ఉత్సవ్‌లో ప్రథమ స్థానం



భద్రాచలం పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవార్డును అందిస్తున్న నిర్వాహకులు

బూర్గంపాడు: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల సహకారంతో నిర్వహించిన కళా ఉత్సవ్ వేడుకల్లో సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో వివిధ విభాగాలలో భద్రాచలం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు భక్తి సంగీత విభాగం, నృత్య విభాగంలో ఇచ్చిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. 34 జిల్లాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ కళా ఉత్సవ్‌లో భద్రాచలం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్ ప్రశాంత్ యు.కిట్‌కురే, ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళలకు, పిల్లలకు వైద్యసేవలు అందించేందుకు గానూ కాంట్రాక్ట్ పద్ధతిన వైద్యుల నియామకం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ మజ్నేకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీ, ఎంఎస్, డిప్లొమా అర్హత కలిగిన ఓ గైనకాలజిస్ట్, ఓ పీడియాట్రీషన్ వైద్యనిపుణులు అర్హులని తెలిపారు. గైనకాలజిస్ట్ వైద్యులకు రూ.2లక్షలు, పీడియాట్రిక్ వైద్యునికి రూ.1.50లక్షల నెలవారి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో, అనుభవ ఒరిజినల్ సర్టిఫికెట్ల రెండేసి జిరాక్స్ ప్రతులతో ఈ నెల 8వ తేదీన ఉదయం 10గంటలకు ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 8317541454 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావునగర్ ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మల్లీశ్వరీ అనారోగ్యంతో బాధపడుతూ భద్రాచలం ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మృతి విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావుల వారి నివాసానికి వెళ్లి మల్లీశ్వరి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలం ఆదివాసీ టీచర్ అసోసియేషన్ నూతన శాఖ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన ఏటీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా రేసు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సోడి శ్రీదేవి, ఉపాధ్యక్షుడిగా కాక కృష్ణవేణి, కోశాధికారిగా సోయం రామలక్ష్మితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కలం సత్యనారాయణ, వాసం ఆదినారాయణ, సీతారామమ్మ, రజిని, విజయ, పుష్ప, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: ఎన్ఎంయూ మాజీ నాయకుడు, మణుగూరు ఆర్టీసి డిపో మాజీ ఉద్యోగి చలసాని కోటేశ్వరరావు అనారోగ్యానికి గురై రెండు కాళ్లను కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న కోటేశ్వరరావుకు ఆర్టీసీ డిపో ఉద్యోగుల ద్వారా సేకరించిన ఆర్థిక సహాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. శనివారం తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) రీజినల్ కార్యదర్శి ఏ.కృష్ణ, సుధాకర్‌లు కోటేశ్వరరావును పరామర్శించి రూ.40వేలను అందజేశారు.

కార్తీక పూజలు ప్రారంభం



భద్రాచలంటౌన్: గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమై భద్రాచలం గోదావరి తీరం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక మాసం మొదటి రోజు శనివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు నదికి తరలివచ్చారు. దీంతో గోదావరి తీరం భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. మహిళా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఉసిరికాయపై ఒత్తులను వెలిగించి గోదావరి నదిలో వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు లాంచిపై గోదావరి అవతలి ఒడ్డుకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించి ఒత్తులు వెలిగించి వచ్చారు. అనంతరం భక్తులు రామాలయంతో పాటు సమీపంలోని అనుబంధ ఆలయాలను సందర్శించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రామాలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో..

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని భమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తొలిరోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని సందర్శించిన భక్తులు విఘ్నేశ్వరపూజ, ఆకాశ దీపారాధన, హారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు సదుపాయాలను ఆలయ మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: పంచాయతీల అభివృద్ధి ప్రభుత్వం ఏకైక లక్ష్యం అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని పొట్లపల్లి, మల్లారం పంచాయతీలో పర్యటించారు. ఆయా పంచాయతీలలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పంచాయతీలలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడానికి మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి సమస్యను అధికారి దగ్గర పరిష్కరిస్తామన్నారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

బూర్గంపాడు: ఐదో షెడ్యూల్ ఏరియాలో రాజ్యాంగ బద్ధమైన చట్టాలను, జీఓలను కచ్చితంగా అమలు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బూర్గంపాడులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో షెడ్యూల్ ట్రైబల్స్‌కి ఉద్యోగాల కోసం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏటీఏ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కారం గాంధీ, ప్రధాన కార్యదర్శిగా తెల్లం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సరియం మల్లారావు, కోశాధికారిగా గట్టుపల్లి వెంకట శేష గిరిరావు, సంయుక్త కార్యదర్శిగా పాయం రంగారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గట్టుపల్లి రాంప్రసాద్, మహిళా కార్యదర్శిగా తాటి రమాదేవి, కార్యవర్గ సభ్యులుగా ముక్తి నరేష్, కల్తీ నాగేశ్వరరావు, బైటా బాబురావు, పూర్ణచంద్రరావు, శ్యామల కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కలం సత్యనారాయణ, వాసం ఆదినారాయణ, కొర్సా రాజేష్ పాల్గొన్నారు.



మండల నూతన కమిటీకి నియామక పత్రాలను అందిస్తున్న జిల్లా నాయకులు

సమస్యలు పరిష్కరిస్తాం..



రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు, పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక, బండారి గూడెం గ్రామపంచాయతీలో నెలొన్న సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం తూరుబాక, బండారుగూడెం గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై అటవీ శాఖ అభివృద్ధి చైర్మన్ పోదెం వీరయ్యతో కలిసి అధికారుల సమక్షంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్‌లో ప్రజలు తాగు, సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాల్లో రోడ్లు బాగా లేవని తెలిపారు. తూరుబాక అంబేడ్కర్ కాలనీలోని పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన దృష్టికి తీసుకునివచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, టీఆర్ఎస్ నాయకుడు అన్నెం సత్యనారాయణ మూర్తి, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ ఈదయ్య, డాక్టర్ పుల్లారెడ్డి, ఎంపీఈఓ రామకృష్ణ, ఎంఈఓ సమ్మయ్య, మిషన్ భగీరథ ఏఈ రాము, ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపల్లిలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన పద్మగూడెంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్న గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే పలువురికి వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం గ్రామస్తుల ఇళ్లను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఇళ్లల్లోని నీటి నిల్వలను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, శైలజ, ఆశావర్కర్ రోజా తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

మెస్ చార్జీల పెంపుపై హర్షం



మణుగూరురూరల్: సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థినులు

మణుగూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సరిత, విద్యార్థినులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మెస్ చార్జీల పెంపు చేయడం సంతోషదాయకమన్నారు. గురుకులాల విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమన్నారు. అనంతరం జీవో జారీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అరుణ, దీప, ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీల పెంపు పట్ల మండలపరిధిలోని పలుపాఠశాలల విద్యార్థులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్ట్ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, సున్నంబట్టి, భీమునిగూడెం, కావడిగుండ్ల గిరిజన పాఠశాలల విద్యార్థులు. అశ్వారావుపేట ఎంజేపీటీ, బీసీ. గిరిజన, ముస్లిం మైనార్టీ గురుకులాల విద్యార్థులు శనివారం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.